ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక


ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :116 శుక్రవారం ఫిబ్రవరి 20 2026, పేజీలు - 4 వెల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# ఉచిత పథకాలపై..... సుప్రీంకోర్టు ఆందోళన





- ఉపాధి సృష్టి వర్సెస్ తాత్కాలిక సంక్షేమం.. ఏది స్థిర పరిష్కారం?
- ఎన్నికల ముందు ఉచితాల ప్రకటనలపై ప్రశ్నల వర్షం
- రెవెన్యూ లోటుతో రాష్ట్రాలు ఎలా ముందుకు?
- సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత అవసరం
- ఎన్నికల హామీలు, ఖాళీ ఖజానాలు
- రాష్ట్రాల భవిష్యత్ దిశ ఏమిటి?
- సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం



రాజమండ్రి, 18 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని శిక్షగా కాకుండా శిక్షణగా భావించానని తెలిపారు. బాత్రూంలో జారిపడిన సంఘటన మినహా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని పేర్కొన్నారు .జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనను జైలులో ఉంచితే భయపడతానని కొందరు భావించి ఉండవచ్చని, కానీ తాను ఎవరికీ



భయపడే ప్రసక్తే లేదన్నారు. కాలం తిరిగి వస్తుందని, అన్యాయాలకు తగిన సమాధానం లభిస్తుందని వ్యాఖ్యానించారు. తన ఇంటిపై జరిగిన దాడి వెనుక ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు. దుండగులు గంటల తరబడి దాడి చేసినప్పటికీ పోలీసులు అక్కడే ఉన్నారని, తమ రక్షణలోనే దాడి జరిగిందని విమర్శించారు. దాడి చేసిన వారికి తక్షణమే బెయిల్ లభించిందని, తనకు మాత్రం పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్ రావడం అన్యాయమని అన్నారు. జైల్లో సాధారణ ఖైదీగానే ఉన్నానని, ప్రత్యేక సౌకర్యాలు కోరలేదని తెలిపారు. జైల్లో అందించిన భోజనమే తీసుకున్నానని, ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతుందని, వెనకడుగు వేయనని పునరుద్ఘాటించారు. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి సమాచారం సేకరించిన తర్వాత గుంటూరులో విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని వెల్లడించారు.

# బాల్క సుమన్ అరెస్టుపై... హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

- ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌ను పరామర్శ
- క్యాతన్‌పల్లి ఎన్నికలపై కాంగ్రెస్‌పై ఆరోపణలు
- రాజ్యాంగ పరిరక్షణపై గవర్నర్ స్పందించాలని డిమాండ్









ఆదిలాబాద్, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): ఆదిలాబాద్ సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, బాల్క సుమన్‌తో పాటు రాజిరెడ్డి, అనిల్ లక్ష్మీకాంత్‌లను ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని ఆరోపించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోనే జైళ్లు ఉన్నప్పటికీ వారిని దూర ప్రాంతమైన ఆదిలాబాద్‌కు తరలించడం కక్షపూరిత చర్య అని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ, చైర్మన్ ఎన్నికను కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. పోలీసు బందోబస్తు లేకుండా చేసి ఎన్నిక వాయిదా పడేలా కుట్ర పన్నారని తెలిపారు.దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యాలు జరిగాయని, ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా పోలీసులు కేసులు నమోదు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం సేవించి వచ్చినప్పటికీ చర్యలు తీసుకో లేదని, కానీ బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, చట్టాన్ని అతిక్రమించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ప్రజా తీర్పును కాలరాయడం సరికాదని హరీశ్ రావు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజల తరఫున పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు.

# మరుగుజ్జు అసోసియేషన్ రజతోత్సవానికి ఆహ్వానం

- ఆహ్వాన పత్రిక స్వీకరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- కార్యక్రమానికి హాజరవుతానని హామీ
- నిర్వహణకు ఆర్థిక సహాయం ప్రకటింపు

హైదరాబాద్, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): మరుగుజ్జు అసోసియేషన్ 25వ రజతోత్సవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వీకరించారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నేడు జరిగిన సమావేశంలో మరుగుజ్జు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి. మల్లేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. సంఘం ప్రతినిధులు తమ రజతోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఎమ్మెల్సీని కోరారు. వారి ఆహ్వానాన్ని సాద రంగా స్వీకరించిన మల్లన్న, తప్ప కుండా కార్యక్రమానికి హాజరవు తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణకు తన వంతు సహకారంగా రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించి చెక్కును అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు ఆ చెక్కును సంఘం ప్రతినిధులకు అందించారు. సంఘం కార్యకలాపాలు సమాజానికి దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. మరుగుజ్జు సంఘం సభ్యులతో కాసేపు ముచ్చటించిన మల్లన్న, వారు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో కేంద్రంపై షర్మిల ధ్వజం

- పల్నాడు జిల్లాలో కొనసాగిన యాత్ర
- కరువు పనులపై కేంద్రంపై గ్రామస్థుల ఆగ్రహం
- పాత ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని డిమాండ్

పల్నాడు,//(మనప్రజాప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ యాత్ర నేడు పల్నాడు జిల్లాలో కొనసాగింది. వినుకొండ నియోజకవర్గంలోని వేల్పూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరై శ్రామికులతో ముఖాముఖి




# రాష్ట్ర బడ్జెట్‌పై జగన్ ఘాటు విమర్శలు

- ఇది ప్రజల బడ్జెట్ కాదని వ్యాఖ్య
- ఆదాయ లెక్కలు తప్పుల తడకలని ఆరోపణ
- హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీత

తాడేపల్లి, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రం అని ఆయన అభివర్ణించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ ఆర్థిక విధానాలను ఎండగట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవని జగన్ ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం లక్షల కోట్లుగా వస్తుందని చెప్పినా వాస్తవ వసూళ్లు చాలా తక్కువగా



మన ప్రజాప్రతినిధి దినపత్రిక


శుక్రవారం ఫిబ్రవరి 20 2026



# ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో కేంద్రంపై షర్మిల ధ్వజం

మొదటి పేజీ తరువాయి

చర్చించారు. గ్రామానికి చెందిన ఉపాధి హామీ శ్రామికులు లక్ష్మమ్మ, పుల్లారెడ్డి, దేవయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరువు పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనల కాలంలో కూడా తమకు పూర్తి స్థాయిలో వంద రోజుల పని దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఇరవై రోజులు పని ఇచ్చిందే ఎక్కువని, చేసిన పనికి వేతనాలు కూడా గడువు ప్రకారం చెల్లించలేదని పేర్కొన్నారు. కరువు పనులపై ఆధారపడే కుటుంబాల జాబ్ కార్డులను ముందస్తు సమాచారం లేకుండా తొలగించారని గ్రామస్థులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి జి రామ్ జి విధానం వద్దని, కాంగ్రెస్ అమలు చేసిన ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని రచ్చబండ వేదికగా ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం గ్రామీణ



పేదల జీవనాధారమని, దాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను తిప్పికొడతామని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# రాష్ట్ర బడ్జెట్‌పై జగన్ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ఆదాయ వృద్ధి శాతం కూడా నిరాశాజనకంగా ఉందని, దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ వెనుకబడిందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం కొంతమందికి లాభపడుతోందని, పారదర్శకత లోపిస్తోందని అన్నారు. మహిళలకు నెలకు వెయ్యి ఐదు వందలు, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు నిధులు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. అప్పుల వివరాలు బడ్జెట్‌లో స్పష్టంగా చూపించలేదని కూడా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ప్రజల డబ్బుతో విమానాల్లో తిరుగుతూ జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పారదర్శకమైన, నిజాయితీగల బడ్జెట్ అవసరమని జగన్ స్పష్టం చేశారు.



# బ్లేడ్‌తో చేతులు కోసుకున్న.... 35 మంది విద్యార్థులు

**-ఛత్తీస్‌గఢ్‌లో కలకలం రేపిన ఘటన**

**-ఒకరిని చూసి మరొకరు అనుసరించిన విద్యార్థులు**

**-కౌన్సిలింగ్‌తో పాటు విచారణ ప్రారంభం**



రాయ్‌పూర్, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బ్లేడ్‌తో తమ చేతి మణికట్టుపై కోసుకున్న ఘటన ఛత్తీస్‌గఢ్‌లో కలకలం రేపింది. బాలబాలికలు కలిపి మొత్తం ముప్పై ఐదుగురు విద్యార్థులు ఈ చర్యకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటన ధమ్తరి జిల్లాలోని దహ్దాహ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ఆరవ తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న ఇరవై ఒకరు బాలురు, పద్నాలుగు మంది బాలికలు గత నెల రోజులుగా ఒకరిని చూసి మరొకరు ఈ చర్యను అనుసరించినట్లు వెల్లడైంది. ఫిబ్రవరి పదమూడో తేదీన తల్లిదండ్రులు పిల్లల చేతులపై గాయాలను గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో బ్లేడ్‌లు ఎలా చేరాయన్న ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల గాయాలను వారాలపాటు ఉపాధ్యాయులు గమనించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక బృందం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టింది. గేమింగ్ ఛాలెంజ్ లేదా మాదకద్రవ్యాల ప్రభావం లేదని అధికారులు ప్రాథమికంగా పేర్కొన్నారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ అందించినట్లు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లల మానసిక స్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# నందిగామలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**- ముప్పై రెండు మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం**

**- వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితులకు అండ**

**- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**



నందిగామ, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముప్పై రెండు మంది లబ్ధిదారులకు మొత్తం ఇరవై ఒక లక్షల ఇరవై రెండు వేల తొమ్మిది వందల పది రూపాయల విలువైన చెక్కులను అందజేశారు.వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అందజేయబడింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం చేయడం ముఖ్య మంత్రి సహాయనిధి ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యంగా పేదల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన సహాయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోంది.



# విశాఖ సాగర తీరంలో అంతర్జాతీయ నగర పరేడ్ వైభవం

**- ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలన్ వేడుకల్లో భాగంగా అద్భుత కవాతు**

**- భారత నౌకాదళ శక్తి, మిత్ర దేశాల సాంస్కృతిక ప్రదర్శనలు**

**- గగన విన్యాసాలు, డ్రోన్ షోతో ముగిసిన వేడుకలు**



విశాఖపట్నం, 19 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా పేరొందిన విశాఖపట్నం సాగర తీరంలోని ఆర్కే బీచ్ గురువారం సాయంత్రం అంతర్జాతీయ వైభవానికి వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలన్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నౌకాదళ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాల సాంస్కృతిక వైభవాన్ని ఒకే వేదికపై ఆవిష్కరించిన ఈ పరేడ్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పరేడ్ ఆరంభంలో భారత నౌకాదళానికి చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు గగన తలంలో అద్భుత విన్యాసాలు ప్రదర్శించాయి. అనంతరం భారత త్రివిధ దళాలు భూసేన, నౌకాదళం, వాయుసేన తో పాటు కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు క్రమశిక్షణతో కవాతు నిర్వహించాయి. ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు కూడా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా



నిలిచాయి. వివిధ దేశాల కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నౌకాదళ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సాయంత్రం వేళ డ్రోన్, లేజర్ ప్రదర్శనలు ఆకాశాన్ని రంగుల కాంతులతో నింపగా, చివరగా బాణసంచా వెలుగులు ఆర్కే బీచ్‌ను అలంకరించాయి. సముద్ర భద్రతలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ పరేడ్ నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# మహిళ దుస్తులు లాగడం,చెస్ట్‌పై తాకడం అత్యాచారమే సుప్రీంకోర్టు స్పష్టం

**-అలహాబాద్ హైకోర్టు తీర్పు కొట్టివేత**

**-సుమోటోగా కేసు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు**

**-మహిళల గౌరవానికి భంగం కలిగితే కఠిన చర్యల హెచ్చరిక**




న్యూఢిల్లీ, 18 ఫిబ్రవరి (మనప్రజాప్రతినిధి): మహిళ ఒంటిపైనున్న దుస్తులను లాగడం, చెస్ట్‌పై తాకడం అత్యాచార నేర పరిధిలోకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు వ్యాఖ్యలు సున్నితంగా లేవని, మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆక్షేపించింది. రెండువేల ఇరవై ఒకటి నవంబరులో ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతంలో జరిగిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదైంది. పదకొండేళ్ల బాలికను ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించారు. దుస్తులు లాగి, ఆమెను అనుచితంగా తాకినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలిక అరుపులు విని స్థానికులు చేరుకోవడంతో నిందితులు పరారయ్యారు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు మహిళ చెస్ట్‌పై తాకడం, దుస్తులు లాగడం మాత్రమే అత్యాచారంగా పరిగణించలేమంటూ కేసును కొట్టివేయడంతో దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తీర్పు సమాజానికి తప్పుడు సందేశం ఇస్తుందని పలువురు న్యాయవేత్తలు, మహిళా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించి విచారణ చేపట్టింది. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలు ఏవైనా కఠినంగా పరిగణించాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల వాదనలు వినిపించుకుని తుది తీర్పు వెలువరించింది. మహిళల హక్కులు, గౌరవాన్ని రక్షించడంలో న్యాయస్థానం కట్టుబడి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయంఅందించిన మంచి కట్ల వంశీ

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట: చేగుంట పట్టణ నికి చెందిన పొట్టి శ్రీను అనారోగ్యంతో మరణించాడు విషయం తెలుసుకొన్న ఒకటో వార్డు మెంబర్ మంచి కట్ల వంశీ, పట్టణ మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ తో కలిసి ఆ కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సహాయంగా 3000 రూపాయలు, 50 కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, కుర్ర లక్ష్మీనారాయణ,ఎర్ర శ్రావణ్,పొట్టి విష్ణు, యువ నాయకుడు ఎత్తేశం, తదితరుల పాల్గొన్నారు.




# చేగుంట లో చోరీ



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట:చేగుంట పట్టణ కేంద్రం లో గల డబల్ బెడ్ రూమ్,ఫోర్త్ బ్లాక్ మాడి నరసింహులు తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉండేవాడు, తమ బంధువుల పెళ్లి ఉందని ఊరికి వెళ్ళాడు, ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు ఇంటి తలపులు పగలకొట్టి బీరువాలో ఉన్న డబ్బులు,బంగారం రెండు పట్టు చీరలు ఎత్తుకెళ్లినట్టు తెలిపారు,ఇట్టి విషయం పై నర్సిములు చేగుంట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ధర్యాప్తు చేసుతున్నట్లు ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.



# జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



(మన ప్రజా ప్రతిని ఫిబ్రవరి 19) :సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పరిధిలోని సూరంపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువత, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి దేశభక్తి నినాదాలతో గ్రామం మారుమోగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గేయాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచ్ తాటి సాయి మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ దేశానికి గర్వకారణమని, ఆయన చూపిన ధైర్యసా హసాలు, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. సమాజంలో ఐక్యత, న్యాయం, ధర్మ పరిరక్షణ కోసం శివాజీ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. యువత ఆయన స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాటి సాయి, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, పాలకవర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు యువకులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా, శాంతియుత వాతావరణంలో ముగిసి

# చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు




నేరేడుచర్ల( మనప్రజాప్రతినిధి దినపత్రిక): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధరుంజయ నాయుడు మాట్లాడుతూ..... మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి స్వరాజ్యం సాధించిన వీర శిరోమణి చత్రపతి శివాజీ అని పరాయి పాలకుల పట్ల యమకింకరుడు గా దేశ రక్షణే ధ్యేయంగా ధర్మ రక్షణే ధ్యానంగా స్వాభిమానమే ఆయుధంగా జాతి పౌరుషాన్ని చాటిన శత్రుభయంకరుడు చత్రపతి శివాజీ ఆయన అన్నారు 400 ఏళ్లలాడే దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవాలని ఆ రోజుల్లోనే విత్తనాలు ఎద్దులు ఉచితంగా రైతులుకి అందించిన ఘన చరిత్ర ఛత్రపతిది అని రైతులు వ్యవసాయ కూలీలను కలిపి వారి అభివృద్ధి కొరకు కొరకు అనేక సంస్కరణలు చేపట్టి స్వరాజ్యం అనే నినాదాన్ని ప్రకటించిన ధీరుడు చత్రపతి అని, అణగారిన కులాల వారిని సైన్యంలోకి తీసుకున్న మొట్టమొదటి రాజు అని, మతసామర సేవకే ఎంతో కృషి చేశాడని బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి నిలిచాడని కుంభీ కులంలో పుట్టిన చత్రపతి బీసీ బిడ్డ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్ పట్టణ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాసగౌడ్ బాలు పాల్గొన్నారు

# ప్రబాకర్, చిట్టిబాబు, పద్మల ఆరోపణలు ఉనికిలో బాగమే



పిఓడబ్ల్యు(విముక్తి), పెర్క సునీత


మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్: సిపిఐ(ఎం.ఎల్) క్రాంతి పార్టీకి చెందిన మల్లెపల్లి ప్రబాకర్, సంపంగి పద్మ, మరియు రాంచంద్రన్ పార్టీకి చెందిన చిట్టిబాబులు 2026, ఫిబ్రవరి-19, గురువారం రోజు, హైదరాబాద్ ఎస్.ఎస్.ఎస్.మీడియా సెంటర్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సిపిఐ(ఎం.ఎల్)చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలిపై చేసిన అన్నిరకాల అసత్య ఆరోపణలను పిఓడబ్ల్యు(విముక్తి) రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పెర్క సునీత తీవ్రంగా ఖండించారు. ఇవి తమ ఉనికిలో బాగంగా చేసిన ఆరోపణలు, దారితప్పిన వారి రాజకీయ ఆలోచనలకు పరాకాష్టకు నిదర్శనం అని ఎత్తిచూపారు. డిసెంబర్,2025 లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మల్లెపల్లి గ్రామ సర్పంచిగా నిలబడిన ఒక ప్రవేట్ కాంట్రాక్టర్ కోసం ప్రబాకర్, పద్మలు తమ జాతీయ హోదాలను తాకట్టుపెట్టడాన్ని ఎత్తిచూపిన కేంద్ర కమిటీ కార్యదర్శిపై పని గట్టుకొని చేసిన, లేదా చేస్తున్న ప్రచారాలను, విప్లవ అభిమానులు, పార్టీ, ప్రజాసంఘాలకు చెందిన శ్రేణుల తీవ్రంగా ఖండించాలని గురువారం రోజు పంపిన ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీ, నిర్మాణ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రబాకర్, పద్మల ముఠా పనివిధానానికి చిట్టిబాబు మద్దతుగా నిలబడడం వలనే పార్టీ, ప్రజా సంఘాల నుండి వెలివేయబడ్డాడనే విషయాన్ని విస్మరించి, విమర్శలకు పాల్పడడం ఆయన నైతికను ప్రశ్నార్థకం చేస్తుందని గుర్తుచేశారు. పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి వెనుక బలంగా నిలబడి, ఇలాంటి వారు చేసే ఆరోపణలను బలంగా తిప్పికొట్టాలని సునీత పిలుపునిచ్చారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ జవహర్ నగర్ జిహెచ్ఎంసి కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోని చంద్రపురి కాలనీ (డివిజన్ 2), శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ ఫేస్-వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, స్థానికులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. హిందూ స్వరాజ్య స్థాపన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. జవహర్ నగర్ అడ్మిన్ ఎస్ఐ రాము నాయక్ మాట్లాడుతూ మహనీయుల జయంతి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, శివాజీ వంటి వీరుల స్ఫూర్తితో సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం రంగుల హరి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదని, ధర్మాన్ని రక్షించిన గొప్ప వీరుడని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న ప్రముఖులు: పాల్గొన్న వారుఈ కార్యక్రమంలో బూడిద వెంకటేష్, బాచుపల్లి రమేష్, మరియు మీడియా ప్రతినిధులు వ్యవస్థ న్యూస్ ఛానల్ సీఈఓ అంబాల విష్ణు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుసేవా దృక్పథంతో అన్నదానం:శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు, కాలనీవాసులు ఈ ప్రసాదాన్ని స్వీకరించారు. పేదలకు సేవ చేయడమే శివాజీ మహారాజ్‌కు ఇచ్చే నిజమైన గౌరవమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు:అధ్యక్షుడు: ఆర్.సి. శ్రీకాంత్జనరల్ సెక్రటరీ: కుమ్మరి కృష్ణకోశాధికారి: కత్తెర్ల కిరణ్ యాదవ్వర్కింగ్ ప్రెసిడెంట్స్: మూకర రవి, రంగుల హరికృష్ణగౌరవ అధ్యక్షులు: ఎం. లక్ష్మీనారాయణఉపాధ్యక్షులు: రంగుల శంకర్ఆర్గనైజింగ్ సెక్రటరీస్: కొండ్రాతి నరేష్, కోటగిరి సంతోష్ కుమార్కార్యదర్శులు: గరడ్ మహిపత్రావు దత్త, చిక్క రఘు, కెమ్మసరం నగేష్సహాయ కార్యదర్శులు: కెమ్మసరం సుజాత, మన్నె జ్యోతి, టి. సుజాతగౌరవ సలహాదారులు: సిల్వేరి శ్రీకాంత్, కెమ్మసరం చంద్రయ్య, పండుగ సతీష్ యాదవ్ఈ వేడుకలో కార్యవర్గ సభ్యులు సి.హెచ్. బస్వరాజు, ఎర్ర వెంకటేష్, ఎం. వంశీ, వై. మహేందర్, చట్టు చిరంజీవి, తన్నీరు నాగరాజు, కుంచాల నవీన్ కుమార్, మిత్రా గౌతమ్, ఏ. నాగచారి, ఆర్. చిత్తారి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగాఘననివాళులు యువత ధర్మ మార్గంలో నడవాలి ఎన్బిఎంఐ జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా మహారాష్ట్ర గర్వకారణుడు, హిందూ స్వరాజ్య స్థాపకుడు, వీర యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మేడ్చల్మల్కాజ్గిరి జిల్లాలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోఎన్బిఎంఐమేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ,శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదుడ ఆయన ఒక ఆలోచన, ఒక ఉద్యమం. ధర్మం, న్యాయం, స్వాభిమానంతో జీవించడమే ఆయన జీవన సందేశం. నేటి యువత శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడిచి, అన్యాయానికి ఎదురు నిలబడి, ధర్మం కోసం పోరాడాలి" అని పిలుపునిచ్చారు.అదే విధంగా, దేశ భద్రత, సామాజిక సమానత్వం, మహిళల గౌరవం, ప్రజల హక్కుల పరిరక్షణలో శివాజీ మహారాజ్ ఆదర్శాలు ఎప్పటిక శీప్రాసంగికమేనని పేర్కొన్నారు. యువత మత్తు, నిర్లక్ష్యం, తప్పు దారుల నుంచి బయటపడి సేవాభావంతో సమాజ నిర్మాణంలో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్బిఎంఐ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చివరగా జయ జయ శివాజీ ధర్మానికి జయం నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.

# వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ కు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం




మెదక్ జిల్లా//మనప్రజాప్రతినిధి,తెలుగు దినపత్రిక : ఫిబ్రవరి తేదీ:-19/2/26మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్ గౌడ్ ను గురువారం మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ, ఇతర కార్యక్రమాలలో చేసిన కృషిని జర్నలిస్టులు కొనియాడారు. రానున్న రోజుల్లో సైతం నరేష్ గౌడ్ పట్టణ ప్రజలతో పాటు ఇటు జర్నలిస్టుల సంక్షేమానికి కోసం కూడా కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ అన్నారు. తాను ఏ పదవిలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగరాజు, జర్నలిస్టులు కామాటి కిషన్, సురేంద్ర రెడ్డి ప్రకాష్, కె. రామకృష్ణ, గోపాల్ గౌడ్, లక్ష్మణ్, శ్యామ్, రాము, సంగమేశ్వర్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చట్టాల పట్ల అవగాహన కల్పించాలి ఎస్పీ రోహిత్ రాజు






మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంకళాశాలలు పాఠశాలల్లో విద్యార్థులకు పోక్సో మరియు అత్యాచార ఘటనలనుజిల్లా ఎస్పీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం ఎస్పీ రోహిత్ రాజు భరోసా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ సూచనలు,అబి ,ప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా పోక్సో కేసుల దర్యాప్తు,విచారణలో శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు. బాధితులకు సమగ్ర సహాయ సేవలు అందిం చడం,వైద్య పరీక్షలను వేగవంతం చేయడం, మొత్తం ప్రక్రియను బాలలకు అనుకూలంగా నిర్వహించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఇటీవలి కాలంలో ప్రేమ పేరుతో ఇంటి నుండి వెళ్లిపోతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోక్సో,అత్యాచార చట్టాలు,శిక్షల అమలు,భవిష్యత్ జీవితంపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో బాలురకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఇలాంటి కేసులను తగ్గించడం మాత్రమే కాకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించవచ్చని సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి బి.రాజేందర్,డిఎస్పీ మల్లయ్య స్వామి,కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ,ఆర్ఎంఓ డా.చైతన్య,డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రసాద్,డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి స్వర్ణలత,డీఈఓ నాగలక్ష్మి,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు,జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూని ట్,చైల్డ్లైన్,సఖి,స్వధార్ సెంటర్లు,ఉమెన్ హబ్ ప్రతినిధులు, భరోసా సెంటర్ బృందం,ఇతర సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు

# పోలీస్ జాగీలాలను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంశిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించబడిన రెండు జాగిలాలు ఎనిమిది నెలల పాటు ఐఐటిఎ మొయినాబాద్ నందు బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగిలాలు షైనీ,లైకా లను గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందిం చారు. ప్రేలుడు పదార్థాలను కనుగొనడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఈ రెండు జాగిలాలు జిల్లా పోలీస్ శాఖలో సేవలందించేందుకు రావడం సంతోషకరమన్నారు. పోలీస్ జాగిలం షైనీ కు హ్యాండ్లర్ గా వ్యవహారిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ లాల్ సింగ్,లైకా కు హ్యాండ్లర్ గా వ్యవహారి స్తున్న కే.ముత్తయ్య,ఇతర డాగ్ స్క్వాడ్ అధికా రులు,సిబ్బందికి ఈ సందర్భంగా ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న 12 పోలీస్ జాగిలాలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాగిలాల సంరక్షణ,వసతి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి విజయ

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఫిబ్రవరి 19,:చేగుంట మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కును కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాగరాజు, పెంటగౌడ్, మహేందర్ రెడ్డి పదవ తరగతి విద్యార్థుల ఇంటర్ మార్కులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో జిల్లా విద్యాధికారి విజయ, మండల విద్యాధికారి నీరజ తో కలిసి పాఠశాలలో జరుగుతున్న ఇంటర్నల్ మార్క్ సరళిని పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ప్రారంభం కానందున , అన్ని సబ్జెక్టుల 20 మార్కులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కు లిస్ట్ ను తనిఖీ చేయడం జరుగుతుందని వారన్నారు



# పూర్వజన్మ సుకృతం

ప్రజాప్రతినిధి//శ్రీకాళహస్తి నియోజకవర్గం ఫిబ్రవరి 19: శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ ఉభయదారులు అవ్వడం మా పూర్వజన్మ సుకృతం అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి. తెలిపారు. శ్రీకాళహస్తి శైవక్షేత్రం శ్రీ వాయు లింగేశ్వర స్వామి కరుణాకటాక్షములు జ్ఞాన ప్రసూనాంబ ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరూ మీద ఉండాలని శ్రీకాళహస్తీశ్వర స్వామిని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ యొక్క పవిత్ర గిరి ప్రదక్షణ పురస్కరించుకొని మా కుటుంబం ఉభయదారులుగా ఉండడం ఎన్నో జన్మల పుణ్యమని శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులు మా కుటుంబం పైన ఎల్లవేళలా ఉంటాయని అలాగే ప్రజలందరూ కూడా అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా దేవుని కోరుకున్నట్లు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ



ఎమ్మెల్యే కుమార్తె పవిత్ర రెడ్డి. కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు భక్తులు, భారీ ఎత్తున తరలివచ్చారు.

# సీఎం కప్ బాక్సింగ్ పోటీ కి కొండపాక విద్యార్థులు ఎంపిక

మన ప్రజా ప్రతినిధి కొండపాక : జెడ్పిహెచ్ఎస్ కొండపాక బాయ్స్ పాఠశాల నుంచి సీఎం కప్ 2025-26 సంవత్సరానికి రాష్ట్రస్థాయి బాలుర బాక్సింగ్ పోటీ కి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్ తెలియ జేయడం జరిగింది.ఇట్టి పోటీలు మహబూబ్నగర్ స్టేడియంలో ఈనెల 20 నుండి 23 వరకు నిర్వహించ బడతాయని అలాగే రాష్ట్రస్థాయి సీఎం కప్ జూనియర్స్ బాలుర కోకో పోటీలు నల్గొండ స్టేడియంలో నిర్వహించబడతాయని ఇట్టి పోటీలకు ఎస్ మహేష్, బాక్సింగ్ కు, డి శ్రావణ్ కుమార్,ఆర్ పవన్,వి మురళీ కృష్ణ,ఎస్ రాకేష్,టి శివ ఎంపికైనట్లు ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యా యులు సముద్రాల శ్రీనివాస్ ఫిజికల్ డైరెక్టర్ నర్రా భాస్కర్ రెడ్డి,సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ ఏ ఏ పీ సి చైర్మన్ భూలక్ష్మి రమేష్ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.




# అంగన్వాడి భవనానికి భూమి పూజ

మన ప్రజా ప్రతినిధి కొండపాక : మండల పరిధిలోని విశ్వనాధ్ పల్లి రవీంద్ర నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని విశ్వనాథపల్లి లో గురువారం రోజు సర్పంచ్ కోడెల కవిత రవి,గ్రామ పాలకవర్గం చేతుల మీదగా నూతన అంగన్వాడి బిల్డింగ్ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ సొమ్ములతో కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన ఆర్భాటాలా

**-ప్రోటోకాల్ పట్టింపులేని అధికారులు ప్రజాప్రతినిధులు**

**-ప్రారంభోత్సవాలకు నిధులు విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం**

**-బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్**



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 19 ఫిబ్రవరి :ఇల్లంతకుంట మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ మానకొండూరు అసెంబ్లీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ నిధులతో నిర్మించిన ఒక పల్లె దవాఖానా, రెండు గ్రామపంచాయతీలు , అంగన్వాడీలు సంబంధించిన భవన ప్రారంభాలు, భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈజియస్ నిధుల ద్వారా గ్రామాలలో కొత్త గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి భవనాలు, కొత్త కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేస్తున్నారు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా మాత్రమే నిర్మాణాలు పూర్తి అయినవి అని తెలియజేశారు. ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ శాసనసభ్యులు ప్రారంభోత్సవాలు,భూమి పూజలు చేస్తున్నారు అని అన్నారు. పార్లమెంటు సభ్యులకు ప్రోటోకాల్ ప్రకారం ప్రారంభోత్సవం మరియు భూమి పూజకు సంబంధించిన సమాచారం ఇవ్వాల్సి ఉండగా అధికారులు,స్థానిక ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహిస్తుంది అని తెలియజేశారు. అధికార పార్టీ ఎంత మభ్యపెట్టిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.అధికారులు, అధికార పార్టీ ఇదే ధోరణి పునరావృతం చేస్తే కార్యక్రమాలను ఖచ్చితంగా అడ్డుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బత్తిని సాయ గౌడ్ ,దేశెట్టి శ్రీనివాస్, కొలనూరు ముత్తవ్వ, అమ్ముల అశోక్, గాదె మధుసూదన్ పాల్గొన్నారు.

# తిరుపతిని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా అభివృద్ధి.. ఏపీ సీఎం లక్ష్యం....

ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా ఫిబ్రవరి 19.:సి ఐ ఐ.తిరుపతి జోన్ వార్షిక సమావేశం 2025-26 పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్.గురువారం స్థానిక తాజ్ హోటల్ నందు జరిగిన సి ఐ ఐ.తిరుపతి జోన్ అన్యువల్ సమావేశం 2025-26 సమావేశంలో జగన్నాథ అనిరుద్ చైర్మన్ సి ఐ ఐ తిరుపతి జోన్ మేనేజింగ్ డైరెక్టర్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్. సి ఐ ఐ.ఏపీ ,సీఈఓ మేనేజింగ్ డైరెక్టర్ ఫ్లూయింట్ క్లోరైడ్ లిమిటెడ్ మురళీకృష్ణ, సి ఐ ఐ.ఏపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. అపెక్స్ సొల్యూషన్ లిమిటెడ్ ఎల్ టి డి . నరేంద్ర కుమార్, మాజీ చైర్మన్ సి ఐ ఐ.విశాఖపట్నం, శ్రావణ షిప్పింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సాంబశివరావు, సి ఐ ఐ.తిరుపతి జోన్ రావండ్స్ కంట్రోల్ ఎల్ ఎల్ పి .సీఈవో దామోదర నాయుడు, సి ఐ ఐ.తిరుపతి జోన్ కుక్ కజారియా సిరామిక్ ఎస్ పి రాజేంద్ర, అమర హాస్పిటల్ ఎండి . డా. రమాదేవి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్..జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా పారిశ్రామిక మార్పు అనే అంశాన్ని సి ఐ ఐ.చాలా సమయోచితంగా ఎంపిక చేసింది అని తెలిపారు. గత 15బి20 సంవత్సరాల్లో నెల్లూరు, తిరుపతి ,చెన్నై మధ్య ఉన్న ఈ త్రిభుజ ప్రాంతం పారిశ్రామిక రంగంలో వేగవంతమైన అభివృద్ధిని సాధించిందనీ, 2000 సంవత్సరానికి ముందు ఈ ప్రాంతంలో పెద్దగా పరిశ్రమలు లేవన్నారు. అప్పట్లో లియో వర్క్స్, నాయుడుపేట, ఈఎంసి., కృష్ణపట్నం వంటి ప్రాంతాలు పెద్దగా అభివృద్ధి చెందలేదు. ప్రస్తుతం రామాయపట్నం, గాజులమండ్యం వంటి ప్రాంతాలు వేగంగా ఎదుగుతున్నాయ న్నారు. ఆహార ప్రాసెసింగ్ రంగం కూడా మొదటిదశలోనే ఉండేది. 2004 తర్వాత ఉద్యానవన రంగంలో సంస్కరణలు, మైక్రో ఇరిగేషన్ సదుపాయాల వల్ల మామిడి వంటి పంటల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు 20052015 మధ్య కాలంలో విస్తరించాయి అని అన్నారు. ముఖ్యమంత్రి . స్వయంగా ఈ ప్రాంతాన్ని మ్యాప్పై గీసి, ఇక్కడ ఏర్పడే పారిశ్రామిక ప్రాంతాలను గుర్తించారని, ఈ ప్రాంతం రాబోయే 1015 సంవత్సరాల్లో దేశానికి ప్రధాన పారిశ్రామిక ఇంజిన్గా మారాలని వారి ఆకాంక్ష అని తెలిపారు. ఈ ప్రాంతం చెన్నై, బెంగళూరు వంటి రెండు మెట్రో నగరాలకు ఫీడర్ ప్రాంతంగా ఉందనీ, తిరుపతి, చెన్నై అనే రెండు విమానాశ్రయాలు, ప్రధాన పోర్టులు, బలమైన రైల్వే నెట్వర్క్, నాలుగు లైన్ల జాతీయ రహదారులు, గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్వేలు ఈ ప్రాంతానికి పెద్ద బలం అని అన్నారు. గతంలో తిరుపతి నుంచి నాయుడుపేటకు వెళ్లాలంటే రెండు గంటలు సమయం పట్టేదనీ ఇప్పుడు కలెక్టర్ కార్యాలయం నుంచి కేవలం 5055 నిమిషాల్లో చేరుకొనేలా జాతీయ రహదారి అభివృద్ధి చేయడం జరిగిందని, ఇది ప్రజల రోజువారీ జీవితాన్ని సులభతరం చేసిందనీ అన్నారు. సాగరమాల రోడ్ల కింద నాలుగు ప్రధాన రహదారి ప్యాకేజీలు అమలులో ఉన్నాయనీ, ఒక్కో ప్యాకేజీకి సగటున రూ.1200, 1500 కోట్లు వ్యయం అవుతోంది. మొత్తం రూ.6000 కోట్లకు పైగా గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్వేలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. బెంగళూరుచెన్నై ఎక్స్ప్రెస్ వే ఇప్పటికే దాదాపు పూర్తయిందనీ, మదనపల్లె తిరుపతి రోడ్డు, కడపరేణిగుంట రోడ్డు వంటి అనుసంధాన మార్గాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి అని తెలిపారు. తిరుపతి జిల్లాలో సుమారు రూ.6500 కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. రేణిగుంట బైపాస్, ఏర్పేడుపూడి గ్రీన్ఫీల్డ్






రైల్వే లైన్, తిరుపతి, కరకంబాడి డబ్లింగ్ వంటి పనులు కొనసాగుతున్నాయనీ అన్నారు. బెంగళూరుచెన్నై, హైదరాబాద్ చెన్నై హైస్పీడ్ రైలు మార్గాలు కూడా ఈ ప్రాంతం గుండా వెళ్లనున్నాయనీ, పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా పరిశ్రమలకు భూకేటాయింపులు వేగంగా జరుగుతున్నాయనీ, భూమి కేటాయింపులు పొంది ఇప్పటికే ఉత్పత్తినీ ప్రారంభించిన పరిశ్రమలను ప్రత్యక్షంగా చూడడం జరిగిందన్నారు. నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో అత్యంత డిమాండ్ ఉన్న ప్రాంతంగా మారిందనీ,పర్యాటక రంగం కూడా తిరుపతి జిల్లాలో వేగంగా విస్తరిస్తుందని అన్నారు. తిరుపతి పట్టణంలోనే గత నాలుగేళ్లలో సుమారు 8900 హోమ్స్టేలు గలరని, వాటి ఆక్యుపెన్సీ రేటు సుమారు 65 శాతం ఉంది. నాలుగు, ఐదు నక్షత్ర హోటళ్లు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయనీ, నోవోటెల్ఐబిస్, కోర్ట్యార్డ్ మారియట్, లెమన్ ట్రీ ప్రీమియర్ వంటి హోటళ్లుత్వరలో సేవలు ప్రారంభించ నున్నాయని. తిరుపతిని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ఆర్థిక మండలి కేంద్రంగా ఇప్పుడు తిరుపతి జిల్లా ఉందనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సాధించాయని తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ఈ ప్రాంతం గొప్ప మార్పును చవిచూడబోతోందని నాకు పూర్తి నమ్మకం ఉందనీ తెలిపారు. పరిశ్రమలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి . ఆలోచన అని, పరిశ్రమల అభివృద్ధి అగ్ర ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఏ సమస్య వచ్చిన వాటి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

# యువకుడు ఆత్మహత్య

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట:పెళ్లి కావడం లేదని మనస్థాపం చెంది యూవకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండల పరిదిలోని చిన్న శివనూర్ గ్రామం లో చోటు చేసుకుంది, చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కొటారి స్వామి( 30) బైకు మెకానిక్, చేసుకుంటూ జీవనం కొనసాగిం చేవాడు తనకు వివాహం అయితలేదని, వారి యొక్క భూమి మార్పిడి కావడం లేదని తరచూ బాధపడుతూ ఉండేవాడని, ఇట్టి విషయములో మనస్తపము చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు, ఇట్టి విషయములో మృతుని తల్లి కొటారి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



# ఎల్లలు దాటిన సరుబుజ్జిలి గాన కచేరి దొరబాబు రామకృష్ణ బృందం మంత్ర ముగ్ధుల్ని చేసిన సంగీత విహారం

శ్రీకాకుళం (సరుబుజ్జిలి):సంగీతానికి ఎల్లలు లేవని మరోసారి నిరూపించిన గాన కచేరి సరుబుజ్జిలి కళాకారులది. ఆర్ కె ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేక ప్రదర్శనలు ఇచ్చిన ఈ బృందం, ఈసారి “మినీ ఆంధ్ర ప్రదేశ్”గా పేరుగాంచిన రాయిపూర్ వేదికపై అద్భుతమైన గాన ప్రదర్శనతో శ్రోతలను అలరించింది.సాంప్రదాయ సంగీతం నుంచి సినీ గీతాల వరకూ విభిన్న శైలుల్లో సాగిన ఈ కచేరి ప్రేక్షకులకు నిజమైన సంగీత విందుగా మారింది. ప్రతి పాటలోనూ భావ వ్యక్తీకరణ, రాగ భరిత స్వరాల సమన్వయం, వేదికపై ఉన్న సమగ్ర సమన్వయం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది.ఈ గాన కచేరి బృందంలో దొరబాబు, వరాహనరసింహం, రామకృష్ణ, మిన్నరావు, శ్రీమతి మంజు తమ స్వర మాధుర్యంతో సభను కట్టిపడేశారు. ముఖ్యంగా దొరబాబు గారి గానం శ్రోతల హృదయాలను తాకగా, రామకృష్ణ గారి స్వర విన్యాసాలు ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్లు అందుకున్నాయి. శ్రీమతి మంజు గారి మృదుస్వర గానం సభకు ప్రత్యేక శోభను చేకూర్చింది.సంగీతాభిమానులు ఈ కచేరిని ఎంతో ఆదరించి, బృంద సభ్యులను అభినందించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం బృందం సభ్యులు సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ, తమపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి ప్రదర్శనలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.సరుబుజ్జిలి కళాకారుల ప్రతిభ రాష్ట్ర సరిహద్దులు దాటి దేశవ్యాప్తంగా వినిపించాలనే ఆశయంతో ఈ బృందం ముందుకు సాగుతోంది. వీరి గాన ప్రయాణం మరిన్ని విజయ శిఖరాలు అధిరోహించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

